క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మాతాశిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యం



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మాతాశిశు మరణాల రేటును తగ్గించడమే లక్ష్యమని గైనకాలజిస్టు డాక్టర్ రహేల అన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకం కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అనస్థీషియా డాక్టర్ శారద, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటి ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి 67 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి, ఇద్దరు గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు చెప్పారు.

బాధ్యతగా పనిచేయండి

మిడుతూరు: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అడిషనల్ సీడీపీఓ మంగవల్లి సూచించారు. మంగళవారం స్థానిక ఒకటి, రెండు అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలోఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, వర్కర్లు, శారద, మంగమ్మ, రాధిక, లక్ష్మి పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి ముఖ్య అర్చకుడి విరాళం

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆలయ ముఖ్య అర్చకుడు మామిళ్లపల్లి రాఘవశర్మ రూ.10,116 విరాళం అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి దాతకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి అభినందించారు.

గిరిజన హాస్టల్ నిర్మాణానికి అంగీకారం

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో గిరిజన హాస్టల్ నిర్మాణం తమకు సమ్మతమేనని గ్రామ సర్పంచ్ శూల రాణి, గ్రామ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు బండిఆత్మకూరు తహసీల్దార్ సుమతికి గ్రామస్తులు అంగీకారం తెలుపుతూ సంతకాలు చేసిన పత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు రామసుబ్బయ్య, ధనుంజయ, మల్లికార్జున, రసూలు తదితరులు ఉన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

నందికొట్కూరు: విద్యారంగానికి శాపంగా మారిన జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజంనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని బిజినవేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు కిషోర్, స్వామి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో స్వాగత తోరణాల ఏర్పాటు



ఆర్చ్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మహానంది: మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ ప్రారంభంలో స్వాగతం పలుకుతూ నూతన స్వాగత తోరణాలు (ఆర్చ్‌గేట్)ను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం ఇంజినీరింగ్ శాఖ అధికారులు పనులు ప్రారంభించారు. మహానంది నుంచి నంద్యాల వైపు వెళ్లే టోల్‌గేట్ వద్ద ఆర్చ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రెండ్రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆలయ ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు తెలిపారు.

అన్ని చెరువులు నింపాలి

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని అన్ని చెరువులకు నీరు నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, మండలాధ్యక్ష కార్యదర్శులు మాబాషా, వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

నల్లమలలో భారీ వర్షం

- పొంగిన బవనాసి, సుద్దవాగు
- నీట మునిగిన పంటపొలాలు
- గుండ్లకమ్మ వాగు పొంగి జలమయమైన ఆత్మకూరు శివారు కాలనీలు
- ఇళ్లలోకి చేరిన నీరు
- ఆత్మకూరులో 85.8 మి.మీ. వర్షం



ఆత్మకూరు సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు అతి భారీ వర్షం కురిసింది. ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని నల్లకాలువ, కొత్త రామాపురం, ముత్కపల్లి, సిద్దపల్లి, వెంకటాపురం, బైర్లూటీ, రోళ్లపెంట గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలో 85.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షాలకు మండలంలోని బవనాసి, సుద్దవాగు, గుండ్లకమ్మవాగులు పొంగి ప్రవహించాయి. బవనాసి, గుండ్లకమ్మ, సుద్దవాగుకు భారీగా వరద రావడంతో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, కంది పంటలను ముంచెత్తాయి. ఇదిలా ఉండగా ఈ వరదనీరంతా శ్రీశైలం డ్యాంకు నేరుగా చేరుకుంది.

ఇప్పటి వరకు 99 మి.మీ. భారీ వర్షం

ఈనెలలో భారీగా వర్షాలు కురవడం ఇది రెండోసారి. ఈనెల 1వ తేదీన 10.8 మి.మీ., 8వ తేదీన 2.9 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. ప్రస్తుతం జూలై నెల సాధారణ వర్షపాతం 167 మి.మీ. కాగా, ఇప్పటికే 99 మి.మీ. భారీ వర్షం నమోదయ్యింది. రాబోవు 20 రోజుల్లో వర్షాలు భారీగా కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో గత నెల లోలాగానే ఈ నెలలో కూడా భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. జూన్ నెలలో 92 మి.మీ.కు గానూ 250.2 మి.మీ. వర్షం కురిసింది.

ఇదే స్థాయిలో మే నెలలో పరిశీలిస్తే సాధారణంగా 29 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా రికార్డుస్థాయిలో 139.4 మి.మీ. వర్షంపాతం నమోదయ్యింది. కాగా మూడు నెలల వర్షపాతం పరిశీలిస్తే ఎన్నడూ లేనివిధంగా ఆత్మకూరు మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

కళకళలాడుతున్న చెరువులు

ఇప్పటికే పలు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పాటు సిద్ధాపురం చెరువుకు మళ్లీ రెండు అడుగులనీరు వచ్చి చేరింది. అలాగే కరివేన, కొత్తరామాపురం, నల్లకాల్వ చెరువులు నీటితో కళకళ్లాడుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మొక్కజొన్న, కంది పంట సాగుచేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గుండ్లకమ్మ వాగు పొంగి పొర్లడంతో పట్టణంలోని ఏకలవ్యనగర్, లక్ష్మీనగర్, రహ్మత్‌నగర్‌లో దాదాపు 200కు పైగా ఇళ్లను వరద నీరు ముంచెత్తింది. నిరుపేదల గృహాల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తమ ఇళ్లల్లోకి నీరు చేరాయని ప్రజలు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఇదిలా ఉండగా మంగళవారం కురుసిన భారీ వర్షం రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట, కంది పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగ పడడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం...రైతన్నల హర్షం

జూపాడుబంగ్లా: వానదేవుడు ఎట్టకేలకు కరుణించి పక్షం రోజుల తర్వాత వర్షం కురవటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన 14.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుంతు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో అత్యధికంగా 81.4మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా మిడుతూరులో అత్యల్పంగా 4.2మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు తెలిపారు. పాములపాడులో 18.8 ఎం.ఎం, నందికొట్కూరులో 14.2ఎం.ఎం, జూపాడుబంగ్లాలో 14.4ఎం. పగిడ్యాలలో 12.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని చెప్పారు. కురిసిన వర్షంతో ఎండిపోతున్న మొక్కజొన్న, మినుము పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు పేర్కొంటున్నారు. కురిసిన వర్షంతో పొలాలు పదునెక్కటంతో కొంత మంది రైతులు మొక్కజొన్న విత్తనాలు విత్తుకోగా, మరికొంత మంది రైతులు పంటలకు రసాయనిక మందులు వేసుకోవడంలో నిమగ్నమయ్యారు.



పట్టణ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మవాగు



కరివేన గ్రామంలో ప్రవహిస్తున్న వర్షపునీరు



ఇందిరానగర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీరు



ఏకలవ్యనగర్‌లో గుడిసెలోకి చేరిన నీరు

హాస్టల్‌కు సొంత భవనం ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎం.ఆర్.నాయక్, ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు పట్టణ కార్యదర్శి కె.దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు పట్టణంలోని ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ బాలల వసతిగృహాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్నానం గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వంట మనిషి, వర్కర్స్‌ని ఏర్పాటు చేసి హాస్టల్ విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, దిలీప్, లింగేష్, రాజు, బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలి

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును తొలగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఈ కోర్సును తొలగిస్తే ప్రైవేట్ కళాశాలలకు మేలు జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలల వైపు మొగ్గు చూపిస్తే పేద విద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు కుట్ర పన్నినట్లేనన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు కిరణ్, మధు, హరి, వంశీ, పవన్‌కళ్యాణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల అంతర్గత బదిలీల్లో గందరగోళం

- రెండు రోజుల్లో..రెండు ఉత్తర్వులిచ్చిన శ్రీశైల దేవస్థానం ఈఓ
- మొదట 52మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- మరుసటిరోజే పలు మార్పులు, చేర్పులతో రెండోసారి ఉత్తర్వులు జారీ
- అయోమయంలో దేవస్థాన ఉద్యోగులు



శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఉద్యోగుల అంతర్గత బదిలీ వ్యవహారం గందరగోళంగా మారింది. సోమవారం 52మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ దేవస్థాన ఈఓ పెద్దిరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మరుసటి రోజే మొదట జారీ చేసిన ఉత్తర్వులను నిలుపుదల చేసి, పలు మార్పులు, చేర్పులు చేసి మరోసారి ఉత్తర్వులను జారీ చేశారు. రెండు రోజుల్లో రెండు ఉత్తర్వులు వెలువడడంతో ఏ ఉద్యోగికి ఏ స్థానం కేటాయించారో అర్థం కాక అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ జాబితా అయిన ఉంటుందా మరో జాబితా వస్తుందా అని ఉద్యోగులు గందోరగోళ పరిస్థితిలో ఉన్నారు.

మరో పది మంది స్థానాల మార్పు

శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 52 మందిని అంతర్గత బదిలీ చేస్తూ దేవస్థాన ఈఓ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో మొత్తం 62 మందిని అంతర్గతంగా బదిలీ చేశారు. అంటే అదనంగా మరో పది మంది స్థానాలు మారాయి. వసతి విభాగంలో పనిచేస్తున్న ఏఈవో మోహన్‌ను గోశాల పర్యవేక్షణకు బదిలీ చేశారు. దేవస్థాన పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న టీ.శ్రీనివాసరావుకు అదనంగా వసతి విభాగము, ప్రోటోకాల్ విధులు కేటాయించారు. అలాగే ఏడు మంది పర్యవేక్షకులను, ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లను, 11మంది జూనియర్ అసిస్టెంట్లను, పలువురు రికార్డు అసిస్టెంట్లను, కంప్యూటర్ ఆపరేటర్లను, అటెండర్లను, కాంట్రాక్ట్ లేబర్లను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల స్థానాలను మార్పు చేశారు.

డీఈఓ సెలవులో ఉండగానే హడావుడిగా బదిలీలు

శ్రీశైల దేవస్థానంలో ప్రతి ఫైల్ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి పరిశీలనకు వెళ్లాలని దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఉన్నాయి. ప్రతి ఫైల్ డీఈఓ పరిశీలన తరువాత కార్యనిర్వహణాధికారి వద్దకు వెళుతుంది. అయితే సోమవారం డీఈఓ సెలవులో ఉన్నారు. ఈ క్రమంలో హడావుడిగా డీఈఓ సంతకం లేకుండానే అంతర్గత బదిలీల ఉత్తర్వులు వెలవడ్డాయి. డీఈవో సంతకం లేకుండా అంతర్గత బదిలీలు వెలువడడంతో స్థానికంగా విషయం చర్చనీయాంశం అయింది. ఈ విషయమై దేవస్థాన అధికారులను వివరణ కోరగా డీఈఓ సెలవులో ఉండడంతో ఈఓ సంతకం చేశారని, అలానే కొన్ని అత్యవసర పరిస్థితుల్లో కిందిస్థాయి అధికారి సంతకం లేకపోయినా వారిపై స్థాయి అధికారి సంతకం ఉంటే సరిపోతుందని అధికారులు పేర్కొన్నారు.

పాడిరైతులు పశుగ్రాసం పెంచుకోవాలి



పాడిరైతులకు గడ్డి విత్తనాలను అందజేస్తున్న ఏడీ రామాంజనేయనాయక్

జూపాడుబంగ్లా: పశువుల పోషకులు తప్పనిసరిగా పొలాల్లో పశుగ్రాసాన్ని పెంచుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రామాంజనేయనాయక్ తెలిపారు. మంగళవారం పశుపోషకులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 14తేదీ వరకు పశుగ్రాసవారోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పశువులకు పచ్చిమేత లభించని పరిస్థితులున్నాయన్నారు. పచ్చిమేతను పశువులకు వేయటం ద్వారా వాటి ఆరోగ్యం మెరుగ్గా ఉండటంతో పాటు పాలఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. రెండు, మూడు నుంచి పది వరకు పశువులను పోషించుకొనే వారు తప్పనిసరిగా వారి సొంతం లేదా కౌలు పొలాల్లో పశుగ్రాసాలను పెంచుకుంటే మేలన్నారు. జొన్న, మొక్కజొన్న రకాలైన పశుగ్రాసం విత్తనాలను రాయితీపై రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. సీఎస్‌హెచ్-24 జొన్నరకం గడ్డివిత్తనాలు ఐదు కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ.460లు కాగా రూ.345లు రాయితీపోను రూ.115లకు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే మొక్కజొన్న రకమైన ఆఫ్రికల్‌టాల్ గడ్డివిత్తనాలను ఐదు కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ.340లు కాగా రాయితీ రూ.255పోను రూ.85లకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో ఫ్లెక్సీల రగడ

పాములపాడు: టీడీపీలో ఫ్లెక్సీ వివాదం ఘర్షణకు దారి తీసింది. కొత్త, పాత టీడీపీ వర్గపోరుకు తెర తీసింది. మండలంలోని మద్దూరు గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు 9న విజయోత్సవ ర్యాలీ నిర్వహించేందుకు ఈ నెల 8న సన్నాహాకాలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జయసూర్య ను ఆహ్వానించారు. దీంతో టీడీపీ నాయకులు ఫ్లెక్సీల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన నాయకుడు మద్దూరు మజరా గ్రామం క్రిష్ణానగర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మద్దూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సోమవారం రాత్రి పూటుగా మద్యం సేవించి క్రిష్ణానగర్ గ్రామానికి చేరుకొని నానా హంగామా చేసి బూతు పురాణం మొదలెట్టాడు. గ్రామంలో తాము ఖర్చు చేసి విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తొంటే కొత్తగా పార్టీలో చేరిన మీరెలా ఫ్లెక్సీలు కట్టి పబ్లిసిటీ చేసుకుంటారని నానా దుర్భాషలాడారు. వివాదం తీవ్ర స్థాయికి చేరి ఫ్లెక్సీలు చించే పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామంలో కొత్త, పాత టీడీపీల మధ్య వర్గ పోరుకు ఆజ్యం పోసినట్లైందని ప్రజలు గుసగుస లాడుతున్నారు.

మద్దూరులో టీడీపీకి మెజార్టీ రాలేదని..?

మద్దూరు గ్రామంలో టీడీపీకి ప్రధాన నాయకత్వం, మండల అధ్యక్షుడు ఉన్నప్పటికీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ రావడం, క్రిష్ణానగర్ గ్రామంలో పెద్ద నాయకులు లేనప్పటికీ టీడీపీకి 102 ఓట్లు మెజార్టీ రావడంతోనే జీర్ణించుకోలేక ఈ వివాదానికి తెరలేపారనే ఓ వర్గం వారు మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఈ పరిస్థితులు దేనికి దారి తీస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు: సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మద్దూరు గ్రామంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. పింఛన్‌పెంపు, ఉచిత ఇసుక, ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి సంతకం చేశారన్నారు. అనంతరం వారిని గ్రామస్తులు సన్మానించారు. అంతకు ముునుపు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రారెడ్డి, హరినాథరెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు, పలుచాని మహేశ్వరరెడ్డి, గోవిందు, అఫీస్ తదితరులు పాల్గొన్నారు.


విద్యాసంస్థలను సీజ్ చేయాలి

ఆత్మకూరు: యూపీ స్కూళ్లలో 9, 10వ తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆదిత్య, కేరళ మోడల్, అలెక్స యూపీ స్కూళ్లలో 9, 10వ తరగతులు నిర్వహిస్తున్నారని, వెంటనే విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ-1 బాలాజీనాయక్, ఎంఈఓ-2 సురేష్‌లకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐసా జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాడ్మింటన్ కిట్లు అందజేత

నందికొట్కూరు: విద్యార్థులకు క్రీడా కిట్లు అందించి క్రీడాభివృద్ధికి సహాయ సహకారాలు అందించడం గర్వించదగ్గ విషయమని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పార్వతి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లెక్కల్ టీచర్‌గా పని చేస్తున్న ఉపాధ్యాయురాలు మాధవీలత రూ.6 వేలు విలువ గల బాల్‌బ్యాడ్మింటన్ కిట్లు అందజేశారు. దాత మాధవిలతను హెచ్ఎం, పీడీ జేసింత, ఉపాధ్యాయురాలు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడారంగంలో బాలికలను తీర్చిదిద్దుతున్నామన్నారు. క్రీడారంగంలో రాణించేందుకు దాతల సహకారం ఎంతో అవసరమని చెప్పారు.

వరదనీరు తొలగింపునకు చర్యలు




జేసీబీతో పనులు చేయిస్తున్న మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ ఎం.ఎ.రషీర్

ఆత్మకూరు: భారీ వర్షానికి పట్టణంలో గుల్లకమ్మ వాగు వెంబడి ఉన్న లక్ష్మీనగర్, ఏకలవ్యనగర్, ఇందిరానగర్, గరీబ్‌నగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. స్పందించిన మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ ఎం.ఎ.రషీర్ ఆయా ప్రాంతాలను పరిశీలంచారు. పూడిపోయిన కాలువలను, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను జేసీబీ ద్వారా తొలగించి నీరు సక్రమంగా వెళ్లేలా మార్గం సుగమం చేశారు. దాదాపు ఆ కాలనీల్లో ఉన్న నీళ్లన్నీ తగ్గుముఖం పట్టాయి. అనంతరం మున్సిపాలిటీ కమిషనర్ హరిప్రసాద్, మున్సిపాలిటీ ఏఈ షాకీర్, మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవన్‌కుమార్, రాజేష్, మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ షఫీవుల్లా, 19వ వార్డు కౌన్సిలర్ మూర్తుజావలి, నాయకులు ప్రాంతాలను పరిశీలించారు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగావకాశాలు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్‌బాబు మంగళవారం తెలిపారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చెప్పులు తయారు చేసేందుకు ఉచిత శిక్షణ కార్యక్రమానికి అర్హులైనవారు ఏవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం 45 రోజులు విజయవాడలో ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకొనే వారు 21-40 సంవత్సరాల వయస్సువారై ఉండాలని వివరించారు. శిక్షణలో గృహవసతి, భోజనవసతితో పాటు ఉద్యోగం కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మండలం నుంచి కేవలం ఒక్కరికి మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

అనారోగ్యంతో ఏఎస్ఐ మృతి



కృష్ణుడు (ఫైల్)

మహానంది: మహానంది పోలీస్‌స్టేషన్‌లో మూడేళ్ల పాటు ఏఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కృష్ణుడు(57)అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనమృతి పట్ల ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

అందుబాటులో ఎరువులు

జూపాడుబంగ్లా: రైతుసేవా కేంద్రాల్లో (ఆర్బీకే) రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోరమాండల్ కంపెనీకి చెందిన 20-20-0-13, యూరియా ఎరువులు పుష్కలంగా ఉన్నాయన్నారు. 20-20-0-13 ఎరువు బస్తా రూ.1,192లకు, యూరియా బస్తా రూ.268లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఆధార్, పొలం పాసుబుక్కుతో రైతుసేవా కేంద్రాల్లో ఎరువులను పొందవచ్చునన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

ఆత్మకూరు: వరద ముంపు ప్రాంత ప్రజలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, జి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం వారు పట్టణంలో ముంపు ప్రాంతాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. నీరు ఇళ్లల్లోకి చేరుకోవడంతో ఏకలవ్యనగర్, పద్మావతినగర్, తాతయ్యగుడి, హుసేనా నగర్ తదితర కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అల్లూరులో ధార్మిక కార్యక్రమాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రచారకులు

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో నాలుగు రోజుల పాటు ధార్మిక కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రచారకులు డాక్టరు మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ రామనామం మార్గంలో హిందువులు తరించాలన్నారు. భగవద్గీత గ్రంథం ప్రచారం నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ భక్తి మార్గంలో ప్రజలు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు నాగలక్ష్మయ్య, ప్రచారకులు రత్నాకర్‌రెడ్డి, లక్ష్మిదేవమ్మ, లక్ష్మన్న, నాగలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మరో స్థలం చూపిస్తే శ్మశానవాటికకు కేటాయిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.దాసు

జూపాడుబంగ్లా: వివాదస్పదంగా మారిన శ్మశానవాటిక స్థలం కాకుండా మరో స్థలాన్ని చూపిస్తే దాన్ని శ్మశానవాటికకు కేటాయిస్తామని ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.దాసు తెలిపారు. మంగళవారం ఆయన 80బన్నూరు గ్రామంలో వివాదస్పదంగా మారిన శ్మశానవాటిక, నేషనల్ హైవేలో పోయిన శ్మశానవాటిక స్థలాలను పరిశీలించారు. గ్రామానికి చెందిన దళితుల శ్మశానం నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో పోయింది. కాగా అందుకు ప్రత్యామ్నాయంగా జిల్లా కలెక్టర్ కేటాయించిన స్థలం తనదని గ్రామానికి చెందిన నాగరత్నం హైకోర్టును ఆశ్రయించటంతో కోర్టు స్టే విధించినట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొంత మంది దళితులు హైవేలో పోయిన శ్మశానవాటిక స్థలం కొద్దిగా ఉండటంతో పాటు నీళ్లు ఉండటం వల్ల మృతదేహాలను ఖననం చేసుకోవడం ఇబ్బందిగా ఉంటుందని, కొత్తగా కేటాయించిన స్థలాన్నే శ్మశానవాటికకు ఇవ్వాలని ఆర్డీఓను కోరారు. కొత్తగా కేటాయించిన స్థలం విషయమై హైకోర్టు స్టే విధించినందున దాన్ని ఇవ్వలేమని ఆర్డీఓ గ్రామస్తులకు తెలిపారు. కోర్టు స్టే విధించిన స్థలం మినహాయించి మిగిలిన స్థలాన్ని శ్మశానవాటికకు కేటాయించాలని గ్రామస్తులు కోరడంతో ఆ మేరకు స్థలాన్ని కొలతలు వేసి వివరాలు పంపించాలని తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు. డీటీలు నాగన్న, చంద్రశేఖర్, ఎంఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్ ఉన్నారు.

మొక్కలే జీవనాధారం

కొత్తపల్లి: మానవ కోటికి మొక్కలే జీవనాధారమని, అని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కేడీసీసీ బ్యాంకు సీఈఓ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నాగంపల్లి సొసైటీ కార్యాలయం వద్ద అంతర్జాతీయ సహకార దినోత్సవం, మన్‌కీబాత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి, ఆత్మకూరు మేనేజర్ పెద్ద పులిరాజు, సూపర్‌వైజర్ సయ్యద్ మహమ్మద్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే రకాలు వాడాలి



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

నందికొట్కూరు: అధిక దిగుబడినిచ్చే రకాలనే వాడాలని జిల్లా ఏరువాక కేంద్రం నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.రామకృష్ణ సూచించారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం ఆవరణలో జిల్లా ఏరువాక కేంద్రం నంద్యాల వారి ఆధ్వర్యంలో రైతులకు వరి విత్తన సంచులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వరి పంటలో రైతులు సాగు చేయాల్సిన బీపీటీ-5204 రకానికి ప్రత్యామ్నానికి అధిక దిగుబడినిచ్చే రకాలు బీపీటీ-3082, బీపీటీ-2782 అనే రకాలు రైతులు ఖరీఫ్ సీజన్‌లో వాడాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏఓ షేక్షావలి, పీరు నాయక్, వీఏఏలు శాంతిరాజు, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.